నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 11 ఏప్రిల్ 2024 | MEDAK



చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, అందోలు అసెంబ్లీ నియోజకవర్గం అగ్రనేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డి

# 16న బీఆర్‌ఎస్ బహిరంగ సభ

## సుల్తాన్‌పూర్‌లో స్థలాన్ని పరిశీలించిన నాయకులు

చౌటకూర్, ఏప్రిల్ 10: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో ఈనెల 16న భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతున్నది. సభ నిర్వహణ కోసం సింగూరు చౌరస్తా వద్ద సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో 45 ఎకరాల పట్టా స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ సభా స్థలాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పట్లోళ్ల జైపాల్‌రెడ్డి, ఇతర నేతలు బుధవారం పరిశీలించారు. ఎన్నికల సభ కావడంతో ఈ స్థలానికి సంబంధించి రైతుల వద్ద నుంచి ఎన్‌వోసీ సైతం తీసుకుంటున్నారు. జహీరాబాద్, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల స్థానాల పరిధిలోకి వచ్చే అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, నర్సాపూర్, సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దాదాపుగా లక్ష మంది జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జహీరాబాద్, మెదక్ ఎంపీ స్థానాల్లో హ్యాట్రిక్ సాధించి సత్తాచాటాలని బీఆర్‌ఎస్ కృతనిశ్చయంతో ఉన్నది. జహీరాబాద్ స్థానానికి తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌ను బరిలో నిలిపారు. మెదక్ పార్లమెంట్ స్థానానికి ఎమ్మెల్సీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.వెంకట్రామిరెడ్డిని బీఆర్‌ఎస్ బరిలో నిలిపింది. వీరిద్దరు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కాగా, భారీ బహిరంగ సభ నిర్వహించి, అధికార కాంగ్రెస్, బీజేపీ వెన్నులో వణుకు పుట్టించేలా రంగం సిద్ధం చేసింది. సభకు వచ్చే వాహనాలకు పార్కింగ్, సభా వేదిక, కళాకారుల వేదిక తదితర ఏర్పాట్లపై నాయకులు ఆరాతీశారు. సభా స్థలాన్ని పరిశీలించిన వారిలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పట్లోళ్ల నరహరిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మామిళ్ల రాజేందర్ ముదిరాజ్, మాసానిపల్లి నారాయణముదిరాజ్, చౌకంపల్లి శివకుమార్, పైతర సాయికుమార్, పట్లోళ్ల వెంకట్రామ్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.



పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

# మెదక్ గడ్డ..గులాబీ అడ్డా

## మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి విజయం ఖాయం

- వెంకట్రామిరెడ్డి తెల్లాపూర్‌లోనే ఉంటూ ఓటేస్తున్నారు..
- రిటైర్డ్ ఐఏఎస్‌గా ప్రజల కష్టాలు ఆయనకు బాగా తెలుసు
- గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి
- కాంగ్రెస్ అభ్యర్థి గుణగణాలు ప్రజలకు బాగా తెలుసు
- బీజేపీ ఎంపీ అభ్యర్థికి దుబ్బాక ప్రజలు గుణపాఠం చెప్పారు..
- హామీలు అమలు చేయమంటే కాంగ్రెసోళ్లు చౌకబారు విమర్శలు చేస్తున్నరు..
- పటాన్‌చెరు ఎమ్మెల్యే కుటుంబాన్ని వేధిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- ఎవరూ అధైర్యపడొద్దు..అందరికీ నేనున్నా..
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- రుద్రారంలో బీఆర్‌ఎస్ ప్రచార రథాలు ప్రారంభం

పటాన్‌చెరు, ఏప్రిల్ 10: మెదక్ గడ్డ.. గులాబీ అడ్డా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని సిద్ధి వినాయక దేవస్థానంలో బీఆర్‌ఎస్ ప్రచార రథాలకు ఆయన పూజలు నిర్వహించి ప్రారంభించారు. హరీశ్‌రావుతో పాటు ఈ కార్యక్రమంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి ఒక్కటీ సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలు చేస్తామని రాహుల్, ప్రియాంకా గాంధీ మాటిచ్చారని, 120 రోజులు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనపై కేసీఆర్ ప్రశ్నిస్తే కాంగ్రెసోళ్లు అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. మెదక్ ఎంపీ స్థానం 2004 నుంచి బీఆర్‌ఎస్ ఖాతాలో కొనసాగుతోందన్నారు. ఈసారి కూడా బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

**వెంకట్రామిరెడ్డి లోకల్.. మంచి మనిషి..**

వెంకట్రామిరెడ్డి లోకల్ అని, పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్‌లో ఆయన నివసిస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. వారింట్లోనే 38 ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 38 ఓట్లు పడ్డాయన్నారు. 11 ఏండ్లపాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికారిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందన్నారు. ఉన్నత విద్యావంతుడు వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుంటే మనకు మెరుగైన సేవలు లభిస్తాయని తెలిపారు. దుబ్బాక నుంచి అనాథ పిల్లలు వచ్చి కలిస్తే వారిని ఆదుకున్న గొప్ప మనసున్న వ్యక్తి అని ఆయన కొనియాడారు. సిద్దిపేటలో హమాలీ కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు వస్తే ఫీజు కట్టి అండగా నిలిచారన్నారు. రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని హామీనివ్వడం ఆయన దానగుణానికి నిదర్శమని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**బీజేపీ అభ్యర్థికి దుబ్బాక ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారు...**

దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో ప్రజలకు ఎడ్లు, నాగలి, నిరుద్యోగ భృతి, రైలు అంటూ అనేక హామీలు ఇచ్చిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌ను గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించి తగిన గుణపాఠం చెప్పారని, మోసం చేసినందుకు కర్రుకాల్చి వాత పెట్టారని హరీశ్‌రావు అన్నారు. దుబ్బాక ప్రజల తీర్పునే మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలు బీజేపీ అభ్యర్థికి ఇస్తారని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గుణగణాలు మీకందరికీ తెలిసిందేనన్నారు. గణేశ్‌గడ్డ అచ్చొచ్చిన గడ్డ అని, బీఆర్‌ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్ గెలుపు కోసం పనిచేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో వెంకట్రామిరెడ్డికి మంచి మెజార్టీ రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బూత్ స్థాయి నుంచి బీఆర్‌ఎస్‌కు క్యాడర్ ఉందని, సమన్వయంగా పనిచేసి మెదక్‌లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కుటుంబంపై జరుగుతున్న కుట్రలను హరీశ్‌రావు ఖండించారు. ఎమ్మెల్యే సోదరుడికి సమస్య వచ్చిన సమయంలో అరగంటలో తాను పటాన్‌చెరు చేరుకుని అండగా నిలిచానని గుర్తు చేశారు. ఎవరికి కష్టం వచ్చినా తప్పకుండా అండగా నిలుస్తామని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు.



పటాన్‌చెరులో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, మహిపాల్‌రెడ్డి



మాజీమంత్రి హరీశ్‌రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

## ఆశీర్వదించండి..సేవచేస్తా..

### ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



అధికారిగా పనిచేసిన తనకు ప్రజా సమస్యలు తెలుసని, తనను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిస్తానని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. కలెక్టర్‌గా, వివిధశాఖల అధికారిగా జిల్లాలో సేవలందించానని గుర్తు చేశారు. గెలిపిస్తే నిరంతరం మీ మధ్య ఉండి సేవలందిస్తానని హామీ ఇచ్చారు. ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానన్నారు. తనకు ఎంపీగా సేవచేసే అవకాశం ఇవ్వాలని ప్రజలను వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## భారీ మెజార్టీతో గెలిపిద్దాం ..

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



రుద్రారం సిద్ధి వినాయకుడి దేవస్థానం వద్ద పూజలు చేసి ప్రచారం ప్రారంభించామని, తప్పకుండా భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన ఆయన ఎంపీగా నిలబడడం మనందరికీ గర్వకారణమని, వెంకట్రామిరెడ్డిని గెలిపించి సీఎం కేసీఆర్‌కు గిఫ్ట్‌గా అందజేస్తామన్నారు. నియోజకవర్గంలో 4లక్షల 10వేల ఓట్లున్నాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తే తప్పకుండా భారీ మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 13న పటాన్‌చెరులో జరిగే నియోజకవర్గ సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రచారంపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. గెలుపే ధ్యేయంగా ముందుకు పోదామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

# కాలంచెల్లిన రియాక్టర్లను మార్చాలి

- ప్రమాదాల నివారణకు టెక్నాలజీని వినియోగించాలి
- ప్రమాదానికి ముందే అలారమ్ వచ్చేలా చర్యలు చేపట్టాలి
- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రమాదాలపై పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో సమావేశం

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 10: జిల్లాలోని రసాయన పరిశ్రమల్లో కాలం చెల్లిన రియాక్టర్లను వెంటనే మార్చాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. రసాయనిక పరిశ్రమల్లో భద్రతపై బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రసాయన పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు, పేలుళ్లను నివారించేందుకు ఆధునిక సాంకేతికను వినియోగించాలని సూచించారు. రియాక్టర్ల జీవిత కాలాన్ని ధ్రువీకరించే థర్డ్ పార్టీ తనిఖీ నివేదికలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల తనిఖీ నివేదికలను అందించాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఈనెల మూడో వారంలో నిపుణులతో పారిశ్రామిక భద్రత, స్టాండర్డ్ ఆపరేటీవ్ నోట్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ)పై జిల్లాలోని అన్ని రసాయనిక పరిశ్రమల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని పరిశ్రమల అధికారులను ఆదేశించారు. ప్రతి పరిశ్రమను జిల్లా పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. రియాక్టర్లు ఉన్న పరిశ్రమలు లాగ్‌బుక్ నిర్వహించాలన్నారు. ప్రతి కంపెనీలో సేఫ్టీ పరికరాలను వినియోగించాలని, పరిశ్రమల కార్మికులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. పరిశ్రమల్లో భద్రత నియమాలను పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ప్రశాంత్ కుమార్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్, పీసీబీ అధికారి గీత, పటాన్‌చెరు పరిశ్రమల శాఖ అధికారి కుమార్ పాఠక్, ఫ్యాక్టరీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పథకాలు అమలుచేయని కాంగ్రెస్

## ఉచిత పథకాలను ఉద్దెర పథకాలుగా మార్చిన ప్రభుత్వం

- జిల్లాకో నవోదయ పాఠశాల తేవడంలో బీజేపీ ఎంపీలు విఫలం
- ఎంపీగా గెలిస్తే హుస్నాబాద్‌లో నవోదయ పాఠశాల ఏర్పాటుకు కృషి
- తెలంగాణ ప్రజల గొంతునై పార్లమెంటులో ప్రశ్నిస్తా..
- ఐదేండ్లలో బండి సంజయ్ ఐదు రూపాయల అభివృద్ధి చేయలేదు
- కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ పార్టీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- హుస్నాబాద్‌లో మార్నింగ్‌వాక్, పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం



హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ కట్టపై వాకర్స్, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న వినోద్‌కుమార్, సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 10:ఎన్నికలకు ముందు ఉచిత పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక వాటిని ఉద్దెర పథకాలుగా మార్చి ప్రజలను మోసం చేస్తున్నదని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ, ఆరోగ్యశ్రీ తదితర పథకాలు ఉద్దెర పథకాలేనన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మచెరువు కట్టపై వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మల్లెచెట్టు చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు ఇంటింటికీ తిరిగి ఎంపీగా గెలిపిస్తే చేయబోయే అభివృద్ధి పనులు, గతంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కారుగుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. హమాలీలను కలిసి వారి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసలు పథకాలను ఇంకా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. మహిళలకు రూ.2,500 నగదు, రూ.4వేల పింఛన్, రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.15వేలు ఏవని ప్రశ్నించారు. ప్రజలు సమస్యలతో బాధపడుతున్నారని, రైతులు కరువుతో అల్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని వినోద్‌కుమార్ విమర్శించారు.



హుస్నాబాద్‌లోని మల్లెచెట్టు చౌరస్తాలో కూరగాయల దుకాణదారులకు కరపత్రాలు ఇచ్చి ఓటువేయాలని అభ్యర్థిస్తున్న వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

**గెలిపిస్తే నవోదయ ఏర్పాటు చేస్తా...**

జిల్లాకో నవోదయ పాఠశాల ఉండాలని 1985లో అప్పటి ప్రభుత్వం చట్టం తెచ్చిందని, దీని ప్రకారం తెలంగాణలో మరో 23 నవోదయ పాఠశాలలు రావాల్సి ఉందని బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తాను ఎంపీగా గెలిస్తే జిల్లాకో నవోదయ పాఠశాలను మంజూరు చేయించడంతోపాటు హుస్నాబాద్‌లో నవోదయ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రం నుంచి గెలిచిన నలుగురు బీజేపీ ఎంపీలు ఒక్క నవోదయ పాఠశాలను తెచ్చిన పాపాన పోలేదన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఐదేండ్లలో ఐదు రూపాయలు కూడా కేంద్రం నుంచి తేలేదని విమర్శించారు. ఈజీఎస్, ఎరువుల సబ్సిడీ తానే ఇప్పిస్తున్నట్లు అబద్ధపు ప్రచారం చేస్తున్నాడన్నారు. తాను ఎంపీగా ఉన్న ఐదేండ్లలో రహదారులు, రైల్వేలైన్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఎల్కతుర్తి–హుస్నాబాద్–సిద్దిపేట నుంచి నాందేడ్ వరకు హైవేతో పాటు హైదరాబాద్ నుంచి వేములవాడ వరకు రైల్వేలైన్ తెచ్చామన్నారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.వెయ్యికోట్లు మంజూరు చేయించామని తెలిపారు. కృష్ణా, గోదావరి నీళ్ల కేటాయింపులు, పవర్ ప్రాజెక్టుల నిర్మాణంలో ముందుండి పనిచేశామన్నారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజల గొంతుకనై పార్లమెంటులో ప్రజా సమస్యలపై పోరాడుతానని హామీనిచ్చారు. 24గంటలు కరీంనగర్ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవకు అంకితమవుతానని, కారు గుర్తుకు ఓటేసి ఎంపీగా గెలిపించాలని వినోద్‌కుమార్ కోరారు.

**అభివృద్ధిని వివరిస్తూ... ఆప్యాయంగా పలకరిస్తూ...**

బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధితో పాటు తాను ఎంపీగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని వివరిస్తూ కలిసిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ బోయినపల్లి వినోద్‌కుమార్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి హుస్నాబాద్ పట్టణంలో తనదైన శైలిలో ప్రచారం నిర్వహించారు. వాకర్స్‌తో మాట్లాడి తెలంగాణ భవిష్యత్తు గురించి ఆలోచించాలని కోరారు. మార్నింగ్ వాక్ చేస్తూ కలిసిన ప్రతి ఒక్కరినీ ఏం చేస్తుంటావు... వచ్చే ఎన్నికల గురించి తెలుసా అని ప్రశ్నించారు. కూరగాయల దుకాణాలు, టీ, కిరాణ దుకాణాదారుల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాలినడకన ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఆటోలో ప్రయాణించి ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం మీద హుస్నాబాద్‌లో గులాబీ ప్రచారానికి తెరలేపారని చెప్పొచ్చు. దీంతో పట్టణంలోని బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, గూల్ల రాజు, వాల సుప్రజ నవీన్, గోవిందు రవి, రత్నారవీందర్‌రావు, బోజు రమారవి, ఎండీ అన్వర్, తిరుపతిరెడ్డి, ఆకుల వెంకట్, సుధాకర్, ఇంద్రాల సారయ్య, చిట్టి గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, పూదరి రవీందర్, విజయభాస్కర్, బండి పుష్ప, చిరంజీవి, గుగులోతు రాజు, సత్యంనాయక్, పెసరు సాంబరాజు, మ్యాక నారాయణ, యాస శ్రీనివాస్, భగవాన్ పాల్గొన్నారు.

# కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేయాలి

- మంత్రి కొండా సురేఖ

రామచంద్రాపురం, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేసి అభ్యర్థి నీలం మధు విజయానికి కృషి చేయాలని మంత్రి కొండాసురేఖ పిలుపునిచ్చారు. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో బుధవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశానికి మంత్రి హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీకి ఓటు వేసేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటు వేస్తే ఒరిగేది ఏమి లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుంటేనే మెదక్ జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులు కదనరంగంలోకి దూకి, ఇంటింటి ప్రచారం నిర్వహించి మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని కోరారు. అంతకుముందు పార్టీ అభ్యర్థి నీలం మధు, ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ మంత్రి సురేఖకు స్వాగ తం పలికారు. సమావేశంలో ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు రవీందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, వినయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్సీపురంలో మాట్లాడుతున్న మంత్రి కొండాసురేఖ, పక్కన అభ్యర్థి మధు

# తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మెదక్, ఏప్రిల్ 10 (నమస్తేతెలంగాణ): తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల యంత్రాంగాన్ని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బుధవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. మెదక్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రమేశ్, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఎక్కడ తాగునీటి సమస్య ఉత్పన్నమైనా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి జిల్లాలో తాగునీటి సరఫరా సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

**ధాన్యాన్ని సేకరించాలి..**

2023–24కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాలని, ఎఫ్‌సీఐకి నిర్దేశిత సమయానికి డెలివరీ చేయాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. యాసంగి ధాన్యాన్ని మద్దతు ధరకు రైతుల నుంచి సేకరించాలన్నారు. వడగాల్పులు వీస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.



కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

